క్లుప్తంగా

నేడు విద్యుత్తు అంతరాయం

కొవ్వూరు: దేచెర్లలో 33/11 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలోని వివిధ ఫీడర్లలో వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఐ.పంగిడి, దేచెర్ల, ధర్మవరం గ్రామాల పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా కల్యాణోత్సవాలు

కొవ్వూరు: స్థానిక పెండ్యాల వెంకట్రాయుడు మెమోరియల్ క్లబ్‌లో (ఫ్యాక్టరీ క్లబ్) సీతారామ కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకూ వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం ప్రముఖ పండితుడు గోరు గొంతుభాస్కర వెంకట సుబ్రహ్మణ్యం శ్రీమద్రామాయణంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెంలో సీతారామచంద్ర స్వామి ఆలయం వద్ద ప్రథమ సప్తాహ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను శ్రీరామనవమి వరకూ నిర్వహించనున్నారు. రోజూ వివిధ పూజలు చేస్తున్నారు

కనకమహాలక్ష్మికి పూజలు

చాగల్లు: ఊనగట్ల పుంతలో ముసలమ్మ అనే కనకమహాలక్ష్మి అమ్మవారి ఉగాది ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ ఏర్పాట్లను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. చాగల్లులో గ్రామ దేవత పాటమ్మ అమ్మవారి ఆలయంలో ఉగాది సంబరాలను పురస్కరించుకుని అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మోదీ దిష్టి బొమ్మ దహనం

గోపాలపురం: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించి రెండేళ్ల జైలుశిక్ష పడేలా చేసిందంటూ మండల కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యదర్శి జేష్ట సతీష్‌బాబు మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు మట్టపర్తి రామ్మోహన్‌రావు, బ్లాక్-1 కాంగ్రెస్ అధ్యక్షుడు కొలూరి రతన్‌రాజు, ఎస్సీ సెల్ కన్వీనర్ పిట్టా రామారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

కొవ్వూరు: డివిజన్ పరిధిలో గురువారం ఇంటర్ ప్రథమ సంవత్సరం గణితం, హిస్టరీ, జువాలజీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 15 పరీక్ష కేంద్రాల్లో 4,603 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 258 మంది గైర్హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో మొత్తం 3,722 మంది హాజరు కావాల్సి ఉండగా 140 మంది రాలేదు. ఒకేషనల్‌లో 881 మందికి గాను 118 మంది గైర్హాజరయ్యారు. కొవ్వూరు పట్టణంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో 647 మంది పరీక్షలు రాశారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 262 మందికి గాను ఐదుగురు, చైతన్య కళాశాల కేంద్రంలో 207 మందికి ఆరుగురు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 197 మందికి ఎనిమిది మంది గైర్హాజరయ్యారు.

రాష్ట్ర పద్య పఠన పోటీల్లో ప్రతిభ

ఉండ్రాజవరం: నన్నయ భట్టారక పీఠం ఆధ్వర్యంలో 92వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తణుకు రామకృష్ణ సేవా సమితి ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి పద్యపఠన పోటీలు నిర్వహించారు. ఇందులో వెలగదుర్రు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని హెచ్ఎం చల్లా అహల్య గురువారం తెలిపారు. ఐదో తరగతి విద్యార్థి గున్నేపల్లి గౌతమ్, 4వ తరగతి విద్యార్థి నల్లే ఆదిదుర్గా కృష్ణప్రసాద్ విజేతలుగా నిలిచారని, వీరికి భట్టారక పీఠం నిర్వాహకులు, ప్రముఖుల ఆధ్వర్యంలో జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశామన్నారు. ఆ విద్యార్థులను సర్పంచ్ సాగి పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు ధనిశెట్టి భ్రమరాంబ, అనంతలక్ష్మి, పెద్దలు అభినందించారు.

వ్యక్తికి గాయాలు

కొవ్వూరు: సీతంపేటలో సైకిల్‌పై వెళుతున్న సంగీతం కామేశ్వరరావును కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అతనిని రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

సారా కేసులో వ్యక్తి అరెస్ట్

కొవ్వూరు: దేచెర్ల గ్రామంలో సారా తయారీ స్థావరంపై దాడి చేసి 1,400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. చాగల్లు మండలం చిక్కాల గ్రామానికి చెందిన బైరిశెట్టి వెంకటేశ్వరరావు వద్ద 25 లీటర్ల సారా, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో గౌరీపట్నానికి చెందిన మరో నిందితుడు రాయుడు సూరిబాబు పరారీలో ఉన్నాడన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

ఉండ్రాజవరం: కె.సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ తండ్రి తాతాలు ఇటీవల మృతి చెందారు. అతని కుటుంబ సభ్యులను, తాతాలు సోదరుడైన పశ్చిమ గోదావరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు నార్ని తాతాజీలను ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్ఎస్ అబ్బు రెడ్డి పరామర్శించారు. మాజీ కౌన్సిలర్ కర్రి గంగాధర అప్పారావు పాల్గొన్నారు.

దిగ్విజయం.. సాగు యంత్రం

- రైతు ముంగిటకు యంత్ర పరికరాలు
- 40 శాతం రాయితీపై ప్రభుత్వం సరఫరా

నల్లజర్ల: వ్యవసాయం లాభసాటి కావాలంటే పెట్టుబడి తగ్గి, దిగుబడి పెరగాలి. శ్రమశక్తి వ్యయం పెరిగిన ప్రస్తుత తరుణంలో యాంత్రీకరణ ఒకటే ఇందుకు మార్గం. అదే మార్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తోంది. తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో సాగుకు ఆధునిక పరిజ్ఞానాన్ని జోడించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా అన్నదాతల కోసం యంత్రసేవా పథకాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఈ మేరకు రైతు భరోసా కేంద్రాలు ప్రాతిపదికగా క్లస్టర్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఐదుగురు రైతులు ఒక గ్రూపుగా ఏర్పాటు చేశారు. దీని ద్వారా రైతులకు యంత్ర పరికరాలను సబ్సిడీపై సమకూరుస్తారు. పవర్ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, గడ్డి కట్టే యంత్రాలు, ట్రాక్టర్లు, వరికోత మెషీన్లు వంటి వాటిని ఈ విధంగా రైతులకు అందిస్తున్నారు. ఇందులో 50 శాతం బ్యాంకు రుణం కాగా 40 శాతం సబ్సిడీ ఉంటుంది. మిగిలిన 10 శాతం రైతు గ్రూపులు చెల్లించాలి.

వ్యవసాయాన్ని పండగ చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారు. కర్షకుల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందిస్తున్నారు. ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు సమకూరుస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు. దీనికితోడు వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు సబ్సిడీపై యంత్ర సామగ్రిని అందిస్తున్నారు. యంత్ర పరికరాల కేటాయింపు విషయంలో లబ్ధిదారుల ఎంపికలో ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా చర్యలు చేపట్టారు. రైతులు గ్రూపులుగా ఏర్పడి ఆర్‌బీకేలలో దరఖాస్తు చేసుకుంటే చాలు అర్హతే ప్రామాణికంగా యంత్ర పరికరాలు అందిస్తున్నారు.

గోపాలపురం నియోజకవర్గంలోని నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో 36 రైతు సంఘాలకు రూ.3.64 కోట్ల విలువైన యంత్ర పరికరాలకు రూ.1.22 కోట్ల సబ్సిడీగా అందించారు. ఆరు కోత యంత్రాలకు రూ.1.49 కోట్లకు గాను రూ.52.08 లక్షలు సబ్సిడీగా అందించారు.



రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, అధికారులు (ఫైల్)

గతంలో పక్కదారి పట్టేవి



గత ప్రభుత్వ హయాంలో రైతుల పేరుతో అధికార పార్టీ నాయకులే లబ్ధి పొందేవారు. రైతు రథం పేరుతో సబ్సిడీపై ట్రాక్టర్లు అందిస్తామని చెప్పినప్పటికీ, ఎమ్మెల్యేలు, మంత్రులు సిఫార్సు చేసిన వారికే అవి దక్కేవి. ఇపుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక చిన్న రైతులకు న్యాయం జరుగుతోంది.

– పిచ్చుకుల బద్రీనాథ్, రైతు, అచ్చన్నపాలెం, నలజర్ల మండలం

అర్హత ఉన్నవారికే..



ఎక్కడా ప్రలోభాలు, సిఫార్సులకు తావు లేకుండా రైతులు ఏర్పాటు చేసుకున్న గ్రూపుల స్థితిగతులను పరిశీలించి, కేవలం అర్హతే ప్రామాణికంగా యంత్ర పరికరాలు అందజేస్తున్నాం. చిన్న, సన్నకారు, కౌలు రైతులకు ఉపయోగపడేలా క్లస్టర్ హైరింగ్ సెంటర్లలో వివిధ యంత్ర పరికరాలను అందుబాటులో ఉంచుతున్నాం.

– కె.కమల్‌రాజ్, మండల వ్యవసాయాధికారి, నల్లజర్ల

వైభవంగా గురుచరిత్ర సప్తాహ మహాయజ్ఞం


దూబచర్లలో గురుచరిత్ర సప్తాహ మహాయజ్ఞ పూజల్లో భక్తులు

నల్లజర్ల: దూబచర్ల దత్తసాయి పీఠంలో గురుచరిత్ర సప్తాహ మహాయజ్ఞం గురువారం వైభవంగా జరిగింది. ఈ పూజలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి దత్తసాయి భక్తులు తరలివచ్చారు. యోగీశ్వరులు సుందరస్వామి, సదానందగిరి స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విశ్వశాంతి పరిరక్షణ, లోకకల్యాణార్థం శ్రీవిశలానంద సరస్వతి ఆదేశానుసారం హోమ ద్రవ్యాలతో మహాయజ్ఞాన్ని పురోహితుడు అరిపిరాల రుద్రమూర్తి ఆధ్వర్యంలో ప్రారంభించారు. 28 మంది దంపతులు పూజాధికాలు నిర్వహించారు. వల్లభాపురం నుంచి మాతా నిరంజనానంద విచ్చేసి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. సమర్థరామదాసు స్వామి చరిత్రను పారాయణం చేశారు.

పొగాకు రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

ఎంపీ మార్గాని భరత్‌రామ్

గోపాలపురం: వర్జీనియా పొగాకు రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. గోపాలపురం పొగాకు వేలం కేంద్రంలో గురువారం ఆయన వేలం ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. వర్జీనియా పొగాకు సాగుకు విద్యుత్ రాయితీ, పంటకు సరైన గిట్టుబాటు ధరలు కల్పించాలని, వర్జీనియా పొగాకు నియంత్రణను కేంద్రం ఎత్తివేయాలని ఎంపీకి రైతులు వివరించారు. అనంతరం ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పొగాకు వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని నిర్ణయించుకున్నాయని, అయితే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న డిమాండ్‌ను బట్టి నిబంధనలు సడలింపుపై కేంద్రం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. పొగాకు పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలని పలు కంపెనీల ప్రతినిధులకు సూచించారు. రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ జీవీఎల్ ప్రసాద్, వేలం నిర్వహణాధికారి ఎం.ఆదిశేషయ్య, ఐటీసీ ప్రతినిధి జె.కళ్యాణ్‌రామిరెడ్డి, ఆల్‌ఇండియా పొగాకు బోర్డు ఉపాధ్యక్షుడు గద్దే శేషగిరిరావు, బోర్డు అధ్యక్షులు పిన్నమనేని మధుమోహన్, ఇల్లూరి పెంటలరాజు తదితరులు పాల్గొన్నారు.


గోపాలపురం వేలం కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నిడదవోలు, చాగల్లు మండలాల్లో ఏడు అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు సీడీపీఓ ఎం.ఆశారోహిణి తెలిపారు. గోపవరం-1 (జనరల్), ఇందిరానగర్ (13వ వార్డు) (జనరల్), బ్రాహ్మణగూడెం (బీసీ-ఏ), జీడిగుంట (వీ.హెచ్), అట్లపాడు (ఎస్సీ), చిక్కాల (ఎస్టీ), చిక్కాలపాలెం(జనరల్)లకు రిజర్వు అయ్యాయన్నారు.

తాళ్లపూడి: అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమోదకుమారి తెలిపారు. పెద్దేవం కోడ్ నంబర్ 104లో ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టును ఓసీ మహిళకు కేటాయించామన్నారు.

కొవ్వూరు: అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో డి.మమ్మి తెలిపారు. మద్దూరు-4 కేంద్రం, దొమ్మేరు-2, 4, కుమారదేవం-1, నందమూరు-2, ఆరికిరేవుల-3 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరు ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

గోపాలపురం: స్థానిక ఐసీడీఎస్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో నాలుగు అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని సీడీపీఓ వైబీటీ సుందరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోపాలపురం మండలం గుడ్డిగూడెం (బీసీ-ఈ), పెద్దాపురం(ఎస్సీ), దేవరపల్లి మండలం పల్లంట్ల (ఓపెన్ కేటగిరి), బంధపురం(బీసీ బీ) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నెల 31వ తేదీలోగా ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని అన్నారు.

మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ ప్రదర్శన

కొవ్వూరు: రుడా ఆదేశాల మేరకు కొవ్వూరు పురపాలక సంఘ మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్‌ను గురువారం ప్రదర్శించారు. ఈ ప్లాన్‌పై అభ్యంతరాలు, సూచనలను వచ్చే నెల 21వ తేదీ లోపు తెలియజేయవచ్చు. తమ అభ్యంతరాలను రుడా ఉపాధ్యక్షులు రాజమహేంద్రవరం కమిషనర్, కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌లకు రాతపూర్వకం గాని, ఈ-మెయిల్ ద్వారా గాని తెలియపరచాలని అధికారులు సూచించారు. కొవ్వూరు ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలు, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ నోటీసు బోర్డుల్లో డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌ను ఉంచామని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ తెలిపారు.

శాప్ చైర్మన్‌ను కలిసిన వీరన్న

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు గురువారం తాడేపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వీరన్న మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయంలో యువతను క్రియాశీలకం చేసే దిశగా చర్యలు తీసుకుంటానన్నారు. ఏపీ స్పోర్ట్స్ అథారిటీ (శాప్) చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డిని, ఏపీ రాష్ట్ర అనుబంధ విభాగాల చైర్మన్ చెవిరెడ్డి భాస్కరరెడ్డిలను వీరన్న కలసి శాలువా కప్పి సత్కరించారు. ఐ.పంగిడి సర్పంచ్ గోశాల నాగార్జున పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

కొవ్వూరు: ఏపీ జేఏసీ పిలుపు మేరకు రెవెన్యూ ఉద్యోగులు గురువారం వర్క్‌రూల్ పాటిస్తూ నల్ల రిబ్బన్‌లు ధరించి స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 21వ తేదీ నుంచి రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు వర్క్ టూ రూలు పాటిస్తున్నామని డివిజన్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.రవివిక్రమ్ తెలిపారు. జాయింట్ సెక్రటరీ ఎస్.సతీష్, ఉపాధ్యక్షురాలు ప్రశాంతి పాల్గొన్నారు.

27న కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు: స్థానిక పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 27న ఉదయం 11 గంటలకు జరుగుతుందని చైర్‌పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులపై సమీక్షిస్తామన్నారు.

పశు సంపద వృద్ధికి చర్యలు

పెరవలి: జిల్లాలో పశు సంపద అభివృద్ధికి కృషి చేస్తున్నామని, అన్ని మండలాల్లో పశువుల ప్రదర్శన చేసి ఉత్తమ దూడలకు బహుమతులు అందిస్తున్నామని జిల్లా పశు వైద్యాధికారి ఎస్‌టీజీ సత్య గోవింద్ అన్నారు. పెరవలి మండలం ముక్కామల గ్రామంలో గురువారం పశువుల ప్రదర్శనను ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం రైతులతో జరిగిన సమావేశంలో గోవింద్ ప్రసంగించారు. జిల్లాలో సుమారు 2.20 లక్షల పశువులు మాత్రమే ఉన్నాయని, ఇటువంటి ప్రదర్శనలు ఏర్పాటు చేసి పశు సంపద వృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు. పుట్టిన లేగ దూడలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. పశు మరణాల నివారణకు మొబైల్ వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక వ్యాన్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. 1962 నెంబర్‌కు కాల్ చేస్తే సత్వరమే వచ్చి వైద్య సేవలు అందిస్తారన్నారు. దూడలకు నట్టల నివారణ టీకాలు, కాల్షియం టానిక్స్ వంటివి పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం ఉత్తమ దూడలను ఎంపిక చేసి ఆయా రైతులకు బహుమతులు అందించారు. డివిజన్ పశు వైద్యాధికారి జి.ఏసురత్నం, ఎంపీటీసీ సభ్యులు గండేపల్లి రామకృష్ణ, సర్పంచ్ కేతా త్రిమూర్తులు, అరిగెల అరుణకుమారి, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.


ముక్కామలలో పశువుల ప్రదర్శన పరిశీలిస్తున్న ఎంపీపీ, పశు వైద్యాధికారులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

కొవ్వూరు: జర్నలిస్టుల భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కొవ్వూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నల్లా నాయుడుబాబు అన్నారు. ఇండియన్ జర్నలిస్టు యూనియన్ పిలుపు మేరకు ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) యూనియన్ కొవ్వూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో ఎస్.మల్లిబాబుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గంధం బాబ్జీ, జిల్లా కార్యవర్గ సభ్యులు జీవీవీ సత్యనారాయణ, పుప్పాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరెడ్డికి ఘన నివాళి

చాగల్లు: స్థానికంగా శెట్టిబలిజ, గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని గురువారం నిర్వహించారు. వెంకటరెడ్డి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ ఎస్.అర్జునరావు, కొరు శ్రీనివాస్, మల్లుల శ్రీనివాస్, కె.శ్రీనివాస్, గౌడ, శెట్టిబలిజ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి

గోపాలపురం: భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి సునీల్ అన్నారు. చిట్యాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం భగత్‌సింగ్ వర్ధంతిని ఏఐఎస్ఎఫ్, సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్, సీపీఐ మండల కార్యదర్శి ఆచంట సత్యనారాయణ మాట్లాడుతూ బ్రిటీష్‌వారి అన్యాయాలు, దోపిడీ, దౌర్జన్యాలపై పోరాడిన మహోన్నతుడు భగత్‌సింగ్ అని కొనియాడారు.

ఉండ్రాజవరం: మహనీయుల త్యాగాలు మరువలేనివని మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ఎస్.కార్తీక్ అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతిని మోర్త ఉన్నత పాఠశాలలో మండల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కార్యదర్శి శశికుమార్, దిలిప్, నాగ అంజి, పాఠశాల హెచ్ఎం సూర్జాన్ పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: విప్లవవీరుడు భగత్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు అన్నారు. నిడదవోలులో సీపీఎం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య పోరాటంలో అతి చిన్న వయసులో అమరులైన విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు జి.దానియేల్, యర్రా శ్రీనివాస్, గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.


నిడదవోలులో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


చిట్యాలలో భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నిర్మలగిరిలో సమష్టి దివ్యబలి పూజ

దేవరపల్లి: గౌరీపట్నం వద్ద నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో మేరీమాత ఉత్సవాలు కొనసాగుతున్నారు. గురువారం ఇందులో భారత వాటికన్ రాయబారి, ఫ్రాన్సిస్ పోప్ దూత మోస్ట రెవరెండ్ లియోపోల్డ్ జిరెల్లి పాల్గొన్నారు. రాత్రి పుణ్యక్షేత్రంలోని కళావేదికపై సమష్టి దివ్యబలి పూజ చేశారు. మరియతల్లి స్వరూపానికి రాయబారి జిరెల్లి పూలమాల వేసి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి సమష్టి దివ్యబలి పూజను సమర్పించారు. గౌరీపట్నం సెంటర్ నుంచి అశ్వరథంపై భారీ పోలీస్ బందోబస్తు మధ్య ఊరేగింపుగా పుణ్యక్షేత్రానికి చేరుకుని, ముఖమండపం వద్ద గల మేరీమాతను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. పుణ్యక్షేత్రం తరపున జిరెల్లికి సత్కారం చేశారు. ఏలూరు పీఠాధిపతులు జయరావు పొలిమెర మాట్లాడుతూ 2000లో వాటికన్ రాయబారి బల్దజరీ పుణ్యక్షేత్రాన్ని సందర్శించారని, ఇప్పుడు లియోపోల్డ్ జిరెల్లి సందర్శించినట్టు తెలిపారు. ఈ పూజలో విజయవాడ పీఠాధిపతి రెవ తెలగతోటి రాజారావు, గుంటూరు పీఠాధిపతి రెవ చిన్నబత్తిన భాగ్య, పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవ ఫాదర్ ఎస్.జాన్‌పీటర్ తదితరులు పాల్గొన్నారు.


సమష్టి దివ్య బలిపూజ చేస్తున్న భారత వాటికన్ రాయబారి జిరెల్లి, పీఠాధిపతి జయరావు

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

పెరవలి: బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత నుంచి దూరం కావొచ్చని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీహెచ్ లక్ష్మి తెలిపారు. పెరవలి, కాపవరం గ్రామాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. కార్యక్రమంలో హిమబిందు, మంజీరా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. పోషణ పక్వాడలో భాగంగా తాడిమళ్లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. అధిక పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు.


తాడిమళ్లలో ఆహార పదార్థాల ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి